# ప్రజాపక్షం
# జిల్లా అనుబంధం

హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

మంగళవారం | 06 అక్టోబరు, 2026 | పేజీలు : 08


## ఫోన్ ఎత్తని ఆర్ఐలు, పట్టించుకోని వార్డు ఆఫీసర్లు..

### గ్రీవెన్స్ సెల్ ఉండి ఏం లాభం?

**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్లలో రెవెన్యూ ఇన్స్పెక్టర్(ఆర్ఐ) పనితీరు అత్యంత దారుణంగా ఉందని ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇంటి పన్ను, ట్రేడ్ లైసెన్స్, బిల్డింగ్ పర్మిషన్, నల్లా కనెక్షన్ ఇలా ఏ పని కోసం వెళ్ళినా డబ్బులు ఉంటేనే ఫైల్ కదులుతోందని, లేదంటే వారాల తరబడి ఆఫీసుల చుట్టూ తిప్పించుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్, ఆఫీసుకు వెళ్తే సీట్లో లేదు..సమస్య చెప్పుకుందామని స్థానిక ఆర్ఐలకు, వార్డు ఆఫీసర్లకు ఫోన్ చేస్తే కనీసం స్పందించడ లేదని ప్రజలు మండిపడుతున్నారు. కొందరు ఫోన్ ఎత్తడం లేదని, మరికొందరు రేపు రండి అంటూ దాటవేస్తున్నారనే విమర్శలు వెల్లువెతుతున్నాయి.




### గ్రీవెన్స్ సెల్లో ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం!

దీనితో విసిగిపోయినా ప్రజలు జిడబ్ల్యూఎంసి గ్రీవెన్స్ సెల్లో ఫిర్యాదు చేసినా ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫిర్యాదు నంబర్ వస్తుంది కానీ పరిష్కారం మాత్రం కావడం లేదని అంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, జిడబ్ల్యూఎంసి కమిషనర్ స్పందించి ప్రతి డివిజన్లో ఆర్ఐల పనితీరుపై ఆకస్మిక తనిఖీలు చేపట్టి, అవినీతికి పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



## కెసిఆర్ హయాంలోనే ముస్లిం, మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట

**ప్రజాపక్షం/సిద్దిపేట :** తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ పాలనలో ముస్లిం మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేయడం జరిగిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. సోమవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశంలో బిఆర్ఎస్ మైనార్టీ సెల్ విభాగం నూతన కమిటీని నియమించి అభినందించారు. ఆనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందని కెసిఆర్ ప్రత్యేకంగా గురుకులాలను ఏర్పాటు చేసి సమాజుతోపాటు ఇంగ్లీష్ మీడియం లో మంచి విద్యను అందేలా చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. పార్టీలో కష్టపడి పనిచేసే వారికి మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. పార్టీ కోసం ప్రతి కార్యకర్త సైనికుడిగా పనిచేయాలన్నారు. బిఆర్ఎస్ హయాంలో జరిగిన సంక్షేమాన్ని ప్రతి గడపగడపకు వెళ్లి వివరించడం తో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలన్నారు. అన్ని వర్గాల సంక్షేమ ధ్యేయంగా పాలన కొనసాగించిన బిఆర్ఎస్ సర్కార్ మళ్లీ అధికారంలోకి వస్తుందని గతంలో జరిగిన అభివృద్ధిని కొనసాగించుకుందామన్నారు.

### సిద్దిపేట మైనార్టీ నూతన కమిటి అధ్యక్షుడిగా అతీక్ ఆహ్మద్.

సిద్దిపేట పట్టణ మైనార్టీ అధ్యక్షునిగ అతీక్ అహ్మద్, నియోజకవర్గ అధ్యక్షునిగా సయ్యద్ లాయక్, నియోజకవర్గ మైనార్టీ యూత్ అధ్యక్షునిగా మహమ్మద్ అజీజ్ నియామకమయ్యారు.. ఈ సందర్భంగా హరీష్ రావు గారు నూతన కమిటీ ని ప్రకటించారు.. శుభాకాంక్షలు తెలిపి శాలువా తో అభినందించారు. మైనార్టీల సంక్షేమానికి నూతన కమిటీ పాటుపడాలని సూచించారు.ఈకార్యక్రమంలోమాజీ ఎమ్మెల్సీ ఫారుక్హుస్సేన్, మాజీ వైస్ చైర్మన్ అక్తర్పటేల్, నాయకులు ఇర్షాద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు

## విజయ డెయిరీ పాల ఉత్పత్తుల కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే, కలెక్టర్



**ప్రజాపక్షం/హనుమకొండ :** తెలంగాణ రాష్ట్రంలోని ప్రముఖ పాల ఉత్పత్తుల సంస్థ విజయ డెయిరీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పాల ఉత్పత్తుల విక్రయ కేంద్రాలను సోమవారం హనుమకొండ జిల్లాలో ప్రారంభించారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్పేయి ముఖ్య అతిథులుగా హాజరై ఈ కేంద్రాలను ప్రారంభించారు. హనుమకొండ జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో, అలాగే ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విజయ డెయిరీ పాల ఉత్పత్తుల కేంద్రాలను ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కలెక్టర్ చాహత్ బాజ్పేయి కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పాల ఉత్పత్తుల కేంద్రంలో ఏర్పాటు చేసిన వివిధ రకాల ఉత్పత్తులను వారు పరిశీలించారు.ప్రజలకు నాణ్యమైన, స్వచ్ఛమైన పాల ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకురావడంలో విజయ డైరీ కీలక పాత్ర పోషిస్తోందని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని ప్రజలకు, ముఖ్యంగా బస్టాండ్కు వచ్చే ప్రయాణికులు, ఆసుపత్రులకు వచ్చే రోగులు, వారి సహాయకులు, సిబ్బందికి విజయ డైరీ ఉత్పత్తులు సులభంగా అందుబాటులో ఉండేలా ఈ కేంద్రాలను ఏర్పాటు చేయడం ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ప్రభుత్వ సంస్థల ఆధ్వర్యంలో నాణ్యమైన పాల ఉత్పత్తులను ప్రజలకు చేరువ చేయడంతో పాటు, వినియోగదారులకు సౌకర్యవంతమైన ప్రదేశాల్లో విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా విజయ డైరీ ఉత్పత్తులకు మరింత ఆదరణ లభించే అవకాశం ఉందన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఇలాంటి సేవలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని తెలిపారు.జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్పేయి మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన పాల ఉత్పత్తులు అందుబాటులో ఉండేలా విజయ డైరీ విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రజలు ఈ కేంద్రాలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండే ప్రాంతాల్లో ఇటువంటి కేంద్రాల ఏర్పాటు ద్వారా నాణ్యమైన పాల ఉత్పత్తులను సులభంగా పొందే అవకాశం కలుగుతుందని తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కలెక్టర్ చాహత్ బాజ్పేయి విజయ డైరీ సిబ్బందితో మాట్లాడి కేంద్రంలో అందుబాటులో ఉన్న పాల ఉత్పత్తులు, వాటి విక్రయ విధానం తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు నాణ్యమైన ఉత్పత్తులు అందేలా అవసరమైన ప్రమాణాలను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ఉపాధ్యక్షులు బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలకమండలి సభ్యులు ఈవి శ్రీనివాస రావు, మాజీ కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు వేముల శ్రీనివాస్, నాయకులు తోట పవన్, నలుబోల సతీష్, విజయ డెయిరీ డిడి ధనరాజ్.అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భూపాలపల్లిలో నిధి అగర్వాల్ సందడి..!

### నిధి రాకతో కాసం షాపింగ్ మాల్ వద్ద సందడి

### షాపింగ్ మాల్ను ప్రారంభించిన టాలీవుడ్ హీరోయిన్డ్యాన్స్, అభివాదంతో అభిమానులను అలరించిన నిధి

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** భూపాలపల్లి పట్టణంలో టాలీవుడ్ హీరోయిన్ నిధి అగర్వాల్ సందడి చేశారు. భూపాలపల్లి పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన కాసం షాపింగ్ మాల్ను ఆమె ఘనంగా ప్రారంభించారు. నిధి అగర్వాల్ రాకతో షాపింగ్ మాల్ ప్రాంగణం అభిమానులు, యువతతో కిక్కిరిసిపోయి సందడిగా మారింది. షాపింగ్ మాల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి నిధి అగర్వాల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆమెను చూసేందుకు పెద్ద సంఖ్యలో అభిమానులు తరలిరావడంతో పరిసర ప్రాంతాల్లో సందడి నెలకొంది. నిధి అగర్వాల్ అభిమానులకు అభివాదం చేస్తూ ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా సంగీతానికి అనుగుణంగా నిధి అగర్వాల్ డ్యాన్సులు చేయడంతో అభిమానులు కేరింతలు కొట్టారు. ఆమె డ్యాన్స్లకు అభిమానులు, యువత ఉత్సాహంగా స్పందించారు. నిధి అగర్వాల్తో సెల్ఫీలు దిగేందుకు పలువురు ఆసక్తి చూపారు. భూపాలపల్లి పట్టణంలో కాసం షాపింగ్ మాల్ను ప్రారంభించడం సంతోషంగా ఉందని నిధి అగర్వాల్ పేర్కొన్నారు. పట్టణ ప్రజలకు నూతన షాపింగ్ అనుభూతిని అందించేందుకు కాసం సంస్థ ముందుకు రావడం అభినందనీయమన్నారు. భూపాలపల్లిలో ఏర్పాటు చేసిన నూతన షాపింగ్ మాల్లో వివిధ రకాల వస్త్రాలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. నిధి అగర్వాల్ రాకతో కాసం షాపింగ్ మాల్ ప్రారంభోత్సవం మరింత ప్రత్యేకంగా మారింది. కార్యక్రమం సందర్భంగా అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో భూపాలపల్లి పట్టణంలో సందడి వాతావరణం నెలకొంది. జ్యోతి ప్రజ్వలన చేసి షాపింగ్ అంతా కలియతిరిగి నిధి సందడి చేసింది. ఈ కార్యక్రమంలో కాసం షాపింగ్ యాజమాన్యం ఓం నమశ్శివాయ తో పాటు, పలువురు నాయకులు పాల్గొన్నారు.





## మాజీ మంత్రి జి వెంకటస్వామి సేవలు చిరస్మరణీయం

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** కార్మికులు, పేదల సంక్షేమానికి మాజీ కేంద్ర మంత్రి జి.వెంకటస్వామి చేసిన సేవలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. సోమవారం ఐడీఓసిలో యువజన సర్వీసులు, క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వెంకటస్వామి జయంతి వేడుకల్లో కలెక్టర్ పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాజనీతిజ్ఞుడిగా, ప్రజా నాయకుడిగా వెంకటస్వామి అందించిన సేవలు ఆదర్శనీయమన్నారు. అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, యువజన క్రీడల శాఖ అధికారి రఘు, డిఆర్వో వసంత, ఆర్డిఓ హరికృష్ణ, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గంగారం మోడల్ స్కూల్‌లో సిఎం బ్రేక్ ఫాస్ట్

**ప్రజాపక్షం/కాటారం;**విద్యార్థుల ఆరోగ్యం ఏకాగ్రత,విద్యా ప్రగతిని మెరుగుపరిచే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సిఎం బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమాన్ని కాటారం మండలంలోని గంగారం మోడల్ స్కూల్‌లో ప్రారంభించారు.గంగారం గ్రామ సర్పంచ్ బండం శోభారాణి రాంరెడ్డి, కాటారం మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు తెప్పల దేవేందర్ రెడ్డి సోమవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా నాయకులు విద్యార్థులకు పౌష్టికాహారంతో కూడిన అల్పాహారాన్ని అందించారు.ఇలాంటి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపల్,డిసిసి అధికార ప్రతినిధి పంతకాని సమ్మయ్య,ఉపాధ్యాయులు,డిసిసి ప్రధాన కార్యదర్శి స్వప్న రెడ్డి,అంగజాల అశోక్, మహిళా ప్రధాన కార్యదర్శి అలుబాక సుజాత,ఎఎంసి చైర్మెన్ పంతకాని తిరుమల,డైరెక్టర్ పిల్లమరి రమేష్,కుంభం రమేష్‌రెడ్డి,తప్పుల ప్రభాకర్ రెడ్డి,పంచాయితీ కార్యదర్శి బీరెల్లి కరుణాకర్,కుమార్ యాదవ్,మొగిలి రాజ్ కుమార్,షేక్ రహీం పాల్గొన్నారు.

## అంగన్వాడీ చిన్నారులకు ఉదయాన్నే బ్రేక్‌ఫాస్ట్

**ప్రజాపక్షం/గోవిందరావుపేట:**తెలంగాణ ప్రభుత్వం చిన్నారుల సంక్షేమం ఆరోగ్యం పోషణకు ప్రాధాన్యతనిస్తూ అంగన్వాడీ కేంద్రాల్లో ఉదయం అల్పాహారం అందించే కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా పసర గ్రామంలోని 2వ వార్డు అంగన్వాడీ కేంద్రంలో సోమవారం చిన్నారులకు బ్రేక్ ఫాస్ట్ అందించే క్యార్యక్రమాన్ని ప్రారంభించారు. అంగన్వాడీ కేంద్రం టీచర్ భాయ్ ఆహ్వానం మేరకు 2వ వార్డు సభ్యురాలు జక్కు సదాలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులకు స్వయంగా అల్పాహారం తినిపించారు ఈ సందర్భంగా జక్కు సదాలక్ష్మి మాట్లాడుతూ చిన్నారులకు పౌష్టికాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యకరమైన ఎదుగుదలకు ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. పిల్లల ఆరోగ్యం పోషణ కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది చిన్నారులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# లివర్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



క్లినికల్ డైరెక్టర్, కాలేయ సంబంధిత డాక్టర్ నవీన్ పోలవరపు

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** ప్రపంచవ్యాప్తంగా శరవేగంతో పెరుగుతున్న క్యాన్సర్లలో లివర్ క్యాన్సర్ ఒకటిగా మారుతోందని యశోద హాస్పిటల్ హైటెక్ సిటీకి చెందిన క్లినికల్ డైరెక్టర్, సీనియర్ కన్సల్టెంట్ మెడికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్, లివర్ వ్యాధుల నిపుణుడు డాక్టర్ నవీన్ పోలవరపు, పాంక్రియాస్ స్పెషలిస్ట్ డాక్టర్ కృష్ణ భరద్వాజ్ తెలిపారు. హనుమకొండలో ప్రత్యేక విలేకరుల సమావేశం నిర్వహించారు. అనంతరం క్లినికల్ డైరెక్టర్, డాక్టర్ నవీన్ పోలవరపు మాట్లాడుతూ నిశ్శబ్ద హంతకులుగా ఫ్యాటీ లివర్, హెపటైటిస్ బి, సి వైరస్ లు వస్తున్నాయని అన్నారు. అధిక మద్యపానం వల్ల లివర్ తీవ్రంగా దెబ్బతింటోందని, ముదిరి పోయే వరకు వ్యాధి లక్షణాలు బయట పడక చాలామందికి తెలియదని వారు హెచ్చరించారు. కాళ్లు వాపులు, పొట్ట ఉబ్బరం, లివర్ క్యాన్సర్ వంటి లక్షణాలు ఆలస్యంగా వెలుగులోకి వస్తాయని వైద్యులు వెల్లడించారు. క్రమం తప్పకుండా రక్తపరీక్షలు, అల్ట్రాసౌండ్ స్కానింగ్ చేయించుకోవడం ద్వారా ముందస్తుగానే వ్యాధిని గుర్తించి వ్యాక్సినేషన్, సరైన చికిత్సలతో ప్రాణాపాయాన్ని తగ్గించవచ్చని సూచించారు. పాంక్రియాస్ స్పెషలిస్ట్ డాక్టర్ కృష్ణ భరద్వాజ్ పెగ్గరాజ్ మాట్లాడుతూ అనారోగ్యకరమైన ఆహార అలవాట్ల వల్ల గ్యాస్ట్రిక్ సమస్యలు పెరుగుతున్నాయని, మలవిసర్జనలో మార్పులు, రక్తస్రావం, పొట్ట ఉబ్బరం వంటి లక్షణాలు రెండు వారాలకు మించి ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని ఆయన తెలిపారు. కొలనోస్కోపీ పరీక్ష ద్వారా పేగుల్లో ఏర్పడే పాలిప్స్‌ను తొలిదశలోనే గుర్తించి తొలగించడం వల్ల పెద్దపేగు క్యాన్సర్‌ను నివారించవచ్చని వివరించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ 2030 నాటికి హెపటైటిస్ నిర్మూలన లక్ష్యంగా కృషి చేపడుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యశోద హాస్పిటల్ సిబ్బంది విజయ్ కుమార్, అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల నైపుణ్యాలను గుర్తించి తగిన శిక్షణ

హసన్ పర్తి మండల ఎంఇఒ ఎ.శ్రీనివాస్



**ప్రజాపక్షం/హసన్‌పర్తి :** విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను గుర్తించి, వాటికి అనుగుణంగా తగిన శిక్షణ అందించాలని హసన్‌పర్తి మండల విద్యావనరుల అభివృద్ధిఅధికారి ఎ. శ్రీనివాస్ ఉపాధ్యాయులకు సూచించారు.సోమవారం జిల్లావిద్యాశాఖ,సమగ్రశిక్ష ఆధ్వర్యంలో హసన్‌పర్తి మండలంలోని స్కిల్ స్టార్ ఇంటర్నేషనల్ స్కూల్ లో మూడురోజులపాటు నిర్వహించనున్న కౌశల్ బోధ్ ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమాన్ని ఎంఇఒ ఎ. శ్రీనివాస్ ప్రారంభించారు. జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన వృత్తి విద్యా బోధకులు, ఎంపిక చేసిన సుమారు 120 మంది ఉపాధ్యాయులకు ఈ శిక్షణ నిర్వహిస్తున్నారు.ఈ సందర్భంగా ఎం ఇఒ మాట్లాడుతూ, ప్రతి విద్యార్థిలో ఉన్న సహజ సామర్థ్యాలు, ఆసక్తులు, నైపుణ్యాలను ఉపాధ్యాయులు గమనించి వారిని ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులకు అకడమిక్ విద్యతో పాటు వృత్తి విద్యానైపుణ్యాలను అందించడంద్వారాభవిష్యత్తులో ఉపాధి అవకాశాలను సులభంగా అందిపుచ్చుకునేలాచేయవచ్చన్నారు. విద్యార్థులు సహజంగానే వివిధ వృత్తి నైపుణ్యాల పట్ల ఆసక్తి చూపుతారని, ఆ ఆసక్తిని గుర్తించి సరైనదిశలో తీర్చిదిద్దడం ఉపాధ్యాయుల బాధ్యత అని తెలిపారు.చేసి నేర్చుకోవడం ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం,సృజనాత్మకత,సమస్యపరిష్కార నైపుణ్యాలు పెంపొందుతాయి" అని పేర్కొన్నారు.ఈ శిక్షణ కార్యక్రమంలో ఎంపిక చేసినజిల్లారిసోర్స్‌ఉపాధ్యాయులు, వృత్తి విద్యా బోధకులు, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్ఎస్ గెలుపే లక్ష్యం

పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



**ప్రజాపక్షం/పరకాల :** వరంగల్–ఖమ్మం–నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పిలుపునిచ్చారు. పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను పార్టీ శ్రేణులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని క్షేత్రస్థాయిలో విస్తృతంగా పనిచేయాలని సూచించారు.సోమవారం పరకాల పట్టణంలో పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియపై నిర్వహించిన సన్నాహక సమావేశంలో చల్లా ధర్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో విజయం సాధించాలంటే ముందుగా అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడి ఓటరు నమోదు పూర్తయ్యేలా చూడాల్సిన బాధ్యత పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు.ప్రతి వార్డులోని పట్టభద్రులను గుర్తించి, వారిని సంప్రదించి ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలని సూచించారు. ఓటరు నమోదు ప్రక్రియకు సంబంధించి పట్టభద్రులకు ఎలాంటి సందేహాలు ఉన్నా నివృత్తి చేస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా నమోదు చేసుకునేలా చూడాలన్నారు.గతంలో పట్టభద్రుల ఓటరుగా నమోదైన వారు సైతం తాజా ఓటరు జాబితా కోసం మళ్లీ నమోదు చేసుకోవాల్సి ఉన్నందున ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని చల్లా ధర్మారెడ్డి సూచించారు. వార్డుల వారీగా నాయకులు బాధ్యతలు తీసుకుని నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని అన్నారు. బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా కృషి చేస్తూ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని చల్లా ధర్మారెడ్డి అన్నారు.గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా పరకాల పట్టణంలో 22 వార్డులకు గాను ఇంచార్జీలను మాజీ ఎమ్మెల్యే నియమించారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు, యూత్ నాయకులు,క్లస్టర్ ఇన్‌చార్జీలు,వార్డు ఇన్‌చార్జీలు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలు చేపడితే ఉపేక్షించేది లేదు

నడికూడ తహసీల్దార్ రాణి





**ప్రజాపక్షం /నడికూడ :** నడికూడ మండలంలోని నడికూడ గుట్టపై ప్రభుత్వ భూమిలో నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. తహసీల్దార్ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు ఈ కూల్చివేత చేపట్టారు.ఈ సందర్భంగా తహసీల్దార్ రాణి మాట్లాడుతూ కట్టిస్తున్న వ్యక్తికి నోటీస్ ఇవ్వడం జరిగిందని వాటిని తీసేయడానికి సమయం కూడా ఇచ్చాం కానీ వారు స్పందించకపోవడంతో వాటిని తొలగించామని ప్రభుత్వ భూములను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టిన వారు స్వచ్ఛందంగా అక్కడి నుంచి తొలగిపోవాలని సూచించారు.లేనిపక్షంలో చట్టపరంగా చర్యలు తప్పకుండా తీసుకుంటామని స్పష్టం చేశారు.

## అప్పుల బాధతో వ్యక్తి మృతి

**ప్రజాపక్షం / వేలేరు :** అప్పుల బాధతో ఓవ్యక్తి పురుగుల మందు తాగి మృతి చెందిన ఘటన వేలేరు మండలంలోని కన్నారం గ్రామంలో ఆదివారం వెలుగులోకి వచ్చింది స్థానికులు,పోలీసుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కాషబోయిన కుమార్ (33) వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు.ఈనెల 3 వతేదీన అప్పుల విషయమై,భూమికి సంబందించి రిజిస్ట్రేషన్ జరగక పోవడం అప్పులు ఎలా తీర్చాలన్న ఆందోళనతో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.పరిస్థితి విషమించడంతో ఎంజిఎం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ 4 వతారీకు ఆదివారం సాయంత్రం మృతి చెందినట్లు పేర్కొన్నారు.మృతుని భార్య కాశబోయిన లక్ష్మీ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.ఈఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## రత్నగిరి గ్రామంలో రీసర్వే పనులు పరిశీలించిన తహసీల్దార్



**ప్రజాపక్షం/భీమదేవరపల్లి :** మండలంలోని రత్నగిరి గ్రామంలో జరుగుతున్న రీసర్వే పనులను భీమదేవరపల్లి తహసీల్దార్ బి.రాజేష్ సందర్శించి పరిశీలించారు. రీసర్వే పనుల పురోగతిని సర్వేయర్ కె. విజయ భాస్కర్, రాజు అదనపు గిర్దవర్, జీపీఓ వెంకటేష్ కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా రీసర్వే ప్రక్రియలో భాగంగా చేపడుతున్న భూముల కొలతలు, రికార్డుల పరిశీలన తదితర అంశాలపై సిబ్బంది ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. పనులను నిబంధనల ప్రకారం, పారదర్శకంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

## చిట్యాలలో నూతన ఉత్సవ కమిటీ ఎన్నిక



**ప్రజాపక్షం/చిట్యాల:** మండల కేంద్రంలోని హనుమాన్ భజన మండలి ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న దేవి శరన్నవరాత్రి ఉత్సవాలతో పాటు 2027 సంవత్సరంలో నిర్వహించనున్న శ్రీరామనవమి, గణపతి నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు సంబంధించి నూతన ఉత్సవ కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా చిట్యాల గ్రామంలోని వివిధ కుల సంఘాల ప్రతినిధులు, పెద్దలు, మహిళలు, యువకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, గ్రామంలో ఉత్సవాలను ఘనంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు అందరి సహకారంతో నూతన కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. 2026–2027 మూడు ప్రధాన ఉత్సవాల ఉత్సవ కమిటీ నూతన అధ్యక్షుడుగా సరిగొమ్ముల రాజేందర్, ఉపాధ్యక్షులుగా గుండ జనార్ధన్, చిలుముల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గుర్రపు తిరుపతి, కోశాధికారులు తాటిపల్లి శ్రీనివాస్, క్యాతం మార్కండేయ, సహాయ కార్యదర్శి గంగాధరి రవీందర్, ముఖ్య సలహాదారుగా ఆరెపల్లి నరసింహారాములు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

## చిన్నారుల ఆరోగ్యమే ధ్యేయం



**ప్రజాపక్షం/టేకుమట్ల:**టేకుమట్ల మండలం వెలిశాల సెక్టర్‌లోని రామకృష్ణాపూర్(వి) గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ మాధవి ఆధ్వర్యంలో 9వ పోషణ మాస కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ నాంపల్లి వీరేశం హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన అంగన్‌వాడీ మన బాధ్యత అనే కార్యక్రమాల్లో తల్లులకు పోషణ అవసరం పిల్లల వయసుకు తగ్గ బరువు ఎత్తుకు తగిన బరువు ఉన్నప్పుడే వాళ్ల శారీరకంగా మానసికంగా ఎదుగుదల ఉంటుందని పిల్లలు ఆరోగ్యంగా ఉండాలని గుడ్లు, ఆకుకూరలు, పండ్లు, చిరుధాన్యాలు, పప్పు దినుసులు ఎక్కువగా మీ పిల్లలకు పెట్టి ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దాలని తల్లులకు, గర్భిణీలకు, బాలింతలకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ కుమ్మరి రవి, అంగన్‌వాడీ టీచర్లు పూర్ణిమ, హేమలత, రజిత, ఆయాలు, ఆశా వర్కర్లు, గర్భిణీలు, బాలింతలు, పిల్లలు, తదితరులు పాల్గొన్నారు.

# అసంపూర్తి కంకర బోర్డ్ ప్రధాన రోడ్డు

నిరసన ఆందోళన



**ప్రజాపక్షం/మహబూబాబాద్:** మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 21 22 35 వార్డుల ప్రధాన రోడ్డు అయినటువంటి కంకర బోర్డ్ వద్ద అసంపూర్తిగా వదిలేసిన రోడ్డును వెంటనే పూర్తి చేయాలని నేడు సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో స్థానిక కంకర బోర్డ్ వాటర్ ట్యాంక్ వద్ద వదిలేసిన రోడ్డుపై ఆందోళన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఐ పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్ మాట్లాడుతూ తల లేని మొండెం చందంగా కంకర బోర్డ్ ప్రధాన రోడ్డు ఉందన్నారు. నిత్యం వేలాది మంది ఈ ప్రాంతం నుంచే వాహనదారులు పాదచార్యులు నడుస్తుంటారని ప్రధానమైన పట్టణంలో ఈ మార్గం ఇంతవరకు రోడ్డు నిర్మించకపోవడం బాధాకరమని తెలిపారు. ఈ ప్రాంతంలోనే విద్యాసంస్థలు ప్రభుత్వ కార్యాలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలు ఉన్నాయని 21, 22, 35 వార్డుల ప్రధాన రోడ్లన్నీ ఉన్నాయని తెలిపారు. ఇక్కడే ఉన్న పంప్ హౌస్ ఎన్నో ఏళ్లుగా శిధిలావస్థకు చేరుకొని ప్రమాదకరంగా మారిందని ఈ ప్రాంతంలో ఉన్న తొలగించి కంకర బోర్డ్ ప్రధాన రోడ్డును వెడల్పుగా చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని లేకపోతే ఈ ప్రాంతంలో ప్రధాన రోడ్డు నిర్మించే వరకు సిపిఐ పోరాటం ఆగదని ఆయన హెచ్చరించారు. వెంటనే కంకర బోర్డ్ ప్రధాన రోడ్డును నిర్మించి ఈ ప్రాంత ప్రజల కోరికను నెరవేర్చాలని అధికారులను ప్రజా ప్రతినిధులను పెరుగు కుమార్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చింతకుంట్ల వెంకన్న, మామిళ్ల సాంబలక్ష్మి, నాగుల నాగేశ్వరావు, పుల్లకండం రమేష్, కొండ్ల రమేష్, అంధే భాస్కర్, రమేష్ ,రాము, మెతుకు కుమార్, బాలు, పరమేశ్వర్, తోట రమేష్, కేదాసు రమేష్, ఎండి మహమూద్, కూరాకుల పాల్, ఎర్రోజు పద్మ,జంపాల మురళి తదితరులు పాల్గొన్నారు.

## పత్తి రైతుల సమస్యలు పరిష్కరించాలి

**ప్రజాపక్షం/జఫర్‌గఢ్:** పత్తి రైతుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించి ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ శ్రీనివాస్‌కు సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. సిసిఐ కొనుగోలు కేంద్రాలను అన్ని మిల్లులలో ప్రారంభించాలని, తేమ నిబంధనలు సడలించి పత్తిని పూర్తిగా కొనుగోలు చేయాలన్నారు. క్వింటాకు రూ.475 బోనస్ ఇవ్వాలని, ఎకరాకు 12 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఎల్ 1 నుంచి ఎల్ 5 నిబంధనలు తొలగించి సమీప కేంద్రాలలోనే కొనుగోళ్లు చేపట్టాలని కోరారు. మండల అధ్యక్షులు బిక్షపతి, మండల కార్యదర్శి యాకయ్య, మండల నాయకులు ప్రభాకర్, శంషుద్దీన్, నాగయ్య, శ్రీను, శ్రీను, చిరంజీవి, ఎల్లయ్య, పాల్గొన్నారు.

## సిసి రోడ్లు ప్రాధాన్యత క్రమంలో నిర్మించాలి

**ప్రజాపక్షం/జఫర్‌గఢ్:** సిసి రోడ్లు లేని వీధులలో ప్రాధాన్యత క్రమంలో రోడ్ల నిర్మాణం చేపట్టాలని సిపిఐ మండల జోన్ బాధ్యులు, తమ్మడపల్లి జి గ్రామ కార్యదర్శి వడ్లకొండ సుధాకర్ కోరారు. సోమవారం మండల ప్రజావాణిలో ఎంపిడిఒకు వినతిపత్రం అందజేశారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, రోడ్లులేని గల్లీల్లో నాణ్యతా ప్రమాణాలతో నిర్మాణాలు చేపట్టాలని కోరారు. గ్రామ నాయకులు వేల్పుల పెద రాములు, అన్నపు అజయ్, ఎండీ యాకూ పాషా, బుచ్చయ్య, కృష్ణ, బిక్షపతి, పాల్గొన్నారు.

## గడ్డం భాస్కర్‌కు ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వాలి

**ప్రజాపక్షం/జనగామ టౌన్:** రానున్న గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా పద్మశాలి ముద్దుబిడ్డ ప్రొఫెసర్ గడ్డం భాస్కర్‌కు అవకాశం కల్పించాలని తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం మీడియా ఇన్‌చార్జి, సీనియర్ జర్నలిస్టు చింకిరి కృష్ణమూర్తి పద్మశాలి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రానున్న గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా పద్మశాలి బీసీ ప్రొఫెసర్ గడ్డం భాస్కర్‌కు అవకాశం కల్పిస్తే పద్మశాలీలకు న్యాయం, సముచితస్థానం కల్పించినట్లు జరుగుతుందన్నారు. జనాభాలో అత్యధిక శాతంగా ఉన్న పద్మశాలి కులస్తులకు ఈ అవకాశాన్ని కల్పించి సరైన న్యాయం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి,పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌కు ఆయన విజ్ఞప్తి చేశారు.

## నిరుపేదల కుటుంబాలకు అండగా కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం

**ప్రజాపక్షం/పాలకుర్తి:** రాష్ట్రంలో నిరుపేదల కుటుంబాలకు సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 54 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్నట్లు ఆమె తెలిపారు. నిరుపేదల కళ్లల్లో ఆనందం చూడడం ప్రభుత్వ లక్ష్యమని ఆమె తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి కుటుంబానికి తాను అండగా ఉండి ప్రభుత్వం అందించే అన్ని సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందజేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సరస్వతి, మార్కెట్ చైర్‌పర్సన్ మంజుల భాస్కర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు , సర్పంచ్‌లు శ్రీనివాస్, రమ్య, మల్లారెడ్డి, కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా గంగాధర్ అశోక్

**ప్రజాపక్షం/జోగిపేట :** అందోల్ జోగిపేట కాంగ్రెస్ పార్టీ అందోల్ మండల అధ్యక్షునిగ గంగాధర్ అశోక్ నియమితులయ్యారు. మండల పరిధిలని తాలెల్మ గ్రామానికి చెందిన ఆయన గతంలో తెలుగుదేశం పార్టీలో ఉండి సర్పంచ్‌గా విజయం సాధించి కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచుకున్నారు. అప్పటి నుండి పార్టీలో బలోపేతానికి కృషి చేశారు. ప్రస్తుతం ఆయన సతీమణి గంగాదర్ సునీతా తాల్మేల గ్రామ సర్పంచ్‌గా కొనసాగుతున్నారు.

## గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదుపై దృష్టి

బిజెపి మండల కార్యవర్గ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణాకర్‌రావు



**ప్రజాపక్షం/ములుగు:** రాబోయే ఎంఎల్‌సి ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని గ్రాడ్యుయేట్ ఓటర్ల ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియను వేగవంతం చేయాలని బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు జినుకల కృష్ణాకర్‌రావు సూచించారు. సోమవారం ములుగులో మండలాధ్యక్షుడు రాయంచు నాగరాజు అధ్యక్షతన నిర్వహించిన మండల కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి గ్రాడ్యుయేట్‌ను వ్యక్తిగతంగా కలిసి ఓటరు నమోదుకు అవసరమైన చర్యలు చేపట్టేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. అక్టోబర్ 7న ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా నిర్వహించే కాగడా జ్యోతి ర్యాలీలో నాయకులు , మండల పదాధికారులు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పెగడపల్లి గ్రామానికి చెందిన ప్రశాంత్, పంచోతుకులపల్లి గ్రామానికి చెందిన సంపత్, సాయి బిజెపిలో చేరారు. వారికి పార్టీ నాయకులు కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సమావేశంలో జిల్లా కోశాధికారి గంగిశెట్టి రాజ్‌కుమార్, జిల్లా నాయకులు గాదం కుమార్, జగ్గు నాయక్, చుంచు రవి, మండల ప్రధాన కార్యదర్శులు లకావత్ రాజకుమార్, కుక్కల పవన్‌క్యాణ్, కార్యదర్శులు ఒద్దుల లక్ష్మి, వేల్పుకొండ రఘువీర్, యాటసాగర్, బూత్ అధ్యక్షుడు కట్టయ్య, యాదసంపత్, ఒజ్జల కిరణ్, మేకల రవి, భూక్య కిరణ్, రాజేందర్, ఉడుత దేవేందర్, బిజేవైఎం మండలాధ్యక్షుడు రాయపురపు అనిల్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలి

నర్మెట గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్



**ప్రజాపక్షం/జనగామ:** విద్యార్థులకు పరిశుభ్రమైన ఆహారం అందించాలని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. సోమవారం జనగామ జిల్లా నర్మెట మండలం కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందుతున్న సదుపాయాలు, విద్యా బోధన, పరీక్షల నిర్వాహణ, వసతి భోజనం, పారిశుధ్యం, మౌలిక వసతుల గురించి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.పాఠశాలలో వంటశాల గదిని సందర్శించి పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన పౌష్టిక ఆహారం అందించాలని, మెను ప్రకారం తాజా కూరగాయలు వినియోగిస్తూ నాణ్యమైన ఆహారం అందేలా చూడాలని ఆదేశించారు. ఆయా సబ్జెక్టుపై విద్యార్థులకు ఉన్న సామర్థ్యాన్ని పరిశీలించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగు పరిచేలా బోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని మౌళిక వసతులు కల్పించాలని, అవసరమైన ఫ్యాన్లు, లైట్లు సమకూర్చాలన్నారు. అనంతరం పాఠశాలలోని డార్మిటరీలను పరిశీలించి విద్యార్థినీల వసతిని తెలుసుకున్నారు. పాఠశాలలో సరకుల నిల్వ, గదిని తనిఖీ చేసి అక్కడ నిల్వ చేసిన సరుకులను పరిశీలించారు. మరుగుదొడ్లు, మూత్రశాలలను పరిశీలించి వాటిని శుభ్రంగా ఉంచాలన్నారు. పాఠశాల మైదానం, పరిసరాలను పరిశీలించిన కలెక్టర్ పాఠశాల పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, పిచ్చి మొక్కలను తొలగించాలన్నారు. విద్యార్థినులు, విద్యనభ్యసించే నివసించే ప్రదేశంలో పరిశుభ్రంగా ఉండేలా నిరంతరం పారిశుద్య చర్యలు చేపట్టాలన్నారు. ఈ తనిఖీలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు క్రిష్ణ, తహశీల్దార్ వెంకటరామానుజాచారీ, సర్పంచ్ శ్రీధర్, పంచాయితీ కార్యదర్శి నజీర్,ఉపాధ్యాయులు ఉన్నారు.

## జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పించాలి

**ప్రజాపక్షం/జఫర్‌గఢ్:** జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ పనులు కల్పించి వ్యవసాయ కూలీలను ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఎండి యాకూబ్ పాషా కోరారు. సోమవారం ప్రజావాణిలో ఎంపిడిఒకు కూలీలతో కలిసి వినతిపత్రం అందజేశారు. వర్షాభావ పరిస్థితులతో వ్యవసాయ పనులు తగ్గి కూలీలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఉపాధి పనులకు పనిముట్లు అందించాలని, రోజువారీ కూలీ రూ.800లకు పెంచాలని, ఏడాదికి 200 పనిదినాలు కల్పించాలని డిమాండ్ చేశారు.అజయ్,విష్ణు, బుచ్చయ్య, రాములు, బిక్షపతి, పాల్గొన్నారు.

## ప్రభుత్వ సంక్షేమ పథకాలపై కళా ప్రదర్శన

**ప్రజాపక్షం/లింగాలఘణపురం:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమాల పథకాలపై మండలంలో నెల్లుట్ల గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద, పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో, కళాకారులు సంక్షేమ పథకాలను పాటల రూపంలో ప్రజలను ఆకర్షించే విధంగా పాటల రూపాన వివరించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ నర్సింగ రామకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, ప్రతి ఒక కుటుంబానికి అందే విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవతో అందుతున్నాయని వారు ధీమా వ్యక్తం చేశారు. బడుగు బలహీన వర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలిచిందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ బత్తిని అశోక్ కుమార్ గౌడ్ నాయకులు గాడి పెళ్లి ఆంజనేయులు, కొత్త కొండ గంగాధర్, కళాకారులు కొత్తపల్లి శంకర్, కనకరాజు, చిరంజీవి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## కాళేశ్వరం బాధిత రైతులపై విపక్షాలకు మాట్లాడే హక్కు లేదు





**ప్రజాపక్షం/మహాదేవపూర్;** కాళేశ్వరం ప్రాజెక్టు పేరు తో గత ప్రభుత్వం రైతులకు చేసిన అన్యాయాలపై ఆత్మ విమర్శ చేసున్న తర్వాతనే విపక్షాలు మాట్లాడాలని కాంగ్రెస్ మహిళా నాయకురాలు బందెల సత్యమ్మ,కాళేశ్వరం దేవస్థాన డైరెక్టర్ కుంభం పద్మ సోమవారం ప్రకటనలో హితవు పలికారు.అన్నారం ప్రాజెక్టు గేట్లు వేసిన ప్రతి సారి అన్నారం,నాగెపల్లి ,చంద్రుపల్లి ప్రాంతాల్లోని రైతుల పంటలు మునిగిన సందర్భాల్లో తమ నాయకుడు వచ్చి పంటలను పరిశీలించిన అనంతరం నష్టపరిహారం అందిస్తానని హామీలు ఇచ్చారని ఇప్పటి వరకు ఏదీ అమలు కాలేదని విమర్శించారు.ప్రెస్‌మీట్లు నిర్వహించి తప్పుడు ప్రకటనలు చేయడానికి ముందు గత ప్రభుత్వ హయాంలో రైతులకు జరిగిన అన్యాయాలపై విపక్ష నేతలు ఆత్మ విమర్శ చేసుకోవాలని,ఇప్పటికైనా జ్ఞానోదయం కాకపోవడం విచారకరమని తెలిపారు.కాళేశ్వరం ప్రాజెక్టు రైతులందరినీ తమ ప్రభుత్వం ఆదుకుందని వారికి రావలసిన నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేసారు.ప్రాజెక్టు అభివృద్ధికి తమ వద్ద స్పష్టమైన ప్రణాళికలు ఉన్నాయని,వాటి ప్రకారమే ముందుకు సాగుతామని తెలిపారు.అనవసరమైన విమర్శలు,ప్రచారాలు విపక్షాలు ఇకనైనా మానుకోవాలని తెలిపారు.

## స్కావెంజర్లు, మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు విడుదల చేయాలి

**ప్రజాపక్షం/నెక్కొండ:** స్కావెంజర్లు, మధ్యాహ్న భోజన కార్మికులకు బకాయి ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని కోరుతూఎఐటియుసివరంగల్ జిల్లా నాయకులు సోమవారం జిల్లా కలెక్టర్ సత్య శారదకు మెమోరాండం అందించారు. కార్మికులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో వేతనాలు చెల్లింపులో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఏఐటియుసి జిల్లా అధ్యక్షుడు కందిక చెన్నకేశవులు, కార్యదర్శి గన్నారపు రమేష్‌తో పాటు స్కావెంజర్స్ జిల్లా కార్యదర్శి గొర్రె విజయ, రాయరాకుల కోమల, జర్రిపోతుల విజయ, సదిరం అరుణ, ఎండి యాకూబ్, జర్రిపోతుల రాధా తదితరులు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్మికుల సమస్యలను పరిష్కరించి, పెండింగ్‌లో ఉన్న వేతనాలను తక్షణమే విడుదల చేయాలని వారు కోరారు.

# హాస్టల్‌లో ఎలుకల స్వైరవిహారం ..కవల విద్యార్థినులకు కాటు!





**ప్రజాపక్షం/గూడూరు;**గురుకుల విద్యాలయంలో విద్యార్థినుల భద్రత పారిశుద్ధ్యంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయంలో ఎలుకల బెడద తీవ్రంగా మారిందని విద్యార్థినుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా ఒకే కుటుంబానికి చెందిన కవల విద్యార్థినుల సాయి హర్ష, సాయి వర్షలకు ఎలుకలు కరిచిన ఘటన వెలుగులోకి రావడం హాస్టల్‌లోని పారిశుద్ధ్య పరిస్థితులపై చర్చకు దారితీసింది.ఐదో తరగతి చదువుతున్న కవల విద్యార్థినులు హాస్టల్‌లో ఉంటున్నారు. ఆదివారం రాత్రి ఎలుకలు కరిచినట్లు వారి కుటుంబానికి చెందిన ఇద్దరు విద్యార్థినిలకు ఒకేసారి ఎలుకల బెడద ఎదురుకావడం హాస్టల్‌లో పరిస్థితికి అద్దం పడుతోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలోనూ పలువురు విద్యార్థినులను ఎలుకలు కరిచిన ఘటనలు ఉన్నాయని వారు ఆరోపిస్తున్నారు. విద్యార్థుల భద్రతకు మూలకారణమైన పారిశుద్ధ్య సమస్యను పరిష్కరించకుండా ఇటువంటి సూచనలు చేయడం వల్ల సమస్య పరిష్కారం కాదని వారు పేర్కొంటున్నారు.

**భోజనంపై గతంలోనూ ఫిర్యాదులు**

హాస్టల్‌లో విద్యార్థినులకు అందించే భోజనం మెనూ సరిగా ఉండటం లేదని గతంలో పలుమార్లు తల్లిదండ్రులు ఫిర్యాదు చేసేందుకు వచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. భోజనంపై ప్రశ్నిస్తే తమ పిల్లలను ఇంటికి పంపించిన అనంతరం తిరిగి హాస్టల్‌లో చేర్చుకోకూడదని హెచ్చరించినట్లు కొందరు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.ఈఆరోపణలపై సంబంధిత అధికారులు సమగ్రంగా విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాలని వారు కోరుతున్నారు.ప్రిన్సిపాల్‌కు తహశీల్దార్ నాగ భవాని ముందుగా ప్రిన్సిపాల్‌తో మాట్లాడి విద్యార్థులకు ఉచిత సలహాలు ఇవ్వడం కంటే పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలని సూచించినట్లు తెలిసింది. ఎలుకలు దోమలు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని సమస్య మళ్లీ పునరావృతం కాకుండా చూడాలని ఆదేశించారు.ఈసందర్భంగా తహశీల్దార్ నాగభవాని మాట్లాడుతూ హాస్టల్ పరిసర ప్రాంతాల్లో ఎక్కువగా వ్యవసాయ పొలాలు ఉండటంతో దోమలు ఎలుకలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. అయినప్పటికీ అవి హాస్టల్‌లోకి రాకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని ఈవిషయం ప్రిన్సిపాల్‌కు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు పేర్కొన్నారు.

## ఘనంగా చేర్యాల మార్కెట్ పాలకవర్గం ప్రమాణ స్వీకారం



**ప్రజాపక్షం /జనగామ :** జనగామ నియోజకవర్గంలోని చేర్యాల వ్యవసాయ మార్కెట్ పాలకవర్గ ప్రమాణ స్వీకారం సోమవారం ఘనంచైర్మన్, డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. ప్రమాణ స్వీకారానికి ముందు కొమురవెల్లి దేవస్థానం వద్ద మొక్కులు చెల్లించుకొని చేర్యాల మార్కెట్‌కు చేరుగా మార్కెట్ కార్యాదర్శి పాలకవర్గం చేత ప్రమాణ స్వీకారం చేయించారు. మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఛైర్మన్ కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ చేర్యాల వ్యవసాయ మార్కెట్ అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు. రైతుల పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు పంటల్ని సకాలంలో కొనుగోలు చేసే విధంగా కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా జనగామ మున్సిపల్ ఛైర్ పర్సన్ కడకంచి బాలమణి శ్రీనివాస్, నాయకులు చెంచారపు కరుణాకర్‌రెడ్డి, వంగాల మల్లారెడ్డి, బనుక శివరాజ్ యాదవ్, లింగాల నర్సిరెడ్డితో పాటు పలువురు అభినందనలు తెలిపారు.

## అభయాంజనేయ స్వామి ఆలయానికి బల్లల విరాళం

**ప్రజాపక్షం/మంగపేట:** మంగపేట మండలం తిమ్మంపేట బిసి కాలనీలోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ కమిటీకి బిఆర్ఎస్ పార్టీ సీనియర్ జిల్లా నాయకులు చిట్టిమల్ల సమ్మయ్య వారి మామ పేరు మీద బల్లలను (బెంచీలను) సమర్పించారు. ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆయన చేసిన ఈ ఉదార సేవపై ఆలయ కమిటీ సభ్యులు స్థానిక భక్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు చిట్టి మల్ల సమ్మయ్యకి వారి కుటుంబ సభ్యులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఆయన సమాజానికి, ఆలయ అభివృద్ధికి ఇలాంటి మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించేలా భగవంతుడు వారికి పూర్తి ఆయురారోగ్యాలతో శక్తి యుతులను సహకారాన్ని అందించాలని కమిటీ సభ్యులు ఆకాంక్షించారు.

## యుపిఐ చెల్లింపులపై చార్జీలను రద్దు చేయాలి

సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు:నల్లు సుధకర్ రెడ్డి



**ప్రజాపక్షం/మరిపెడ:**యుపిఐ చెల్లింపులపై చార్జిలను వేసే విధానాన్ని మోదీ కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలనీ సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నల్లు సుధకర్ రెడ్డి డిమాండ్ చేశారు.సోమవారం మరిపెడ మున్సిపల్ కేంద్రంలో జరిగిన పట్టణ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లడుతూ నగదు రహిత ఆర్థిక వ్యవస్థ అనే ప్రచారంతో యూపిఐ చెల్లింపులకు ప్రజలను అలవాటు చేసిన మోదీ ప్రభుత్వం పేద,మధ్య తరగతి ప్రజలపై భారం పడే విధంగా మోసపూరిత విధానాలతో యూపిఐ వినియోగదారులపై పరోక్షంగా,వ్యాపారులపై ప్రత్యక్షంగా ఎండిఆర్ పేరుతో కేంద్ర ప్రభుత్వం 0.4 శాతం చార్జిలను వసూలు చేయడం వెంటనే విరమించుకోవాలనీ డిమాండ్ చేశారు.క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేస్తూ,సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేలా చుస్తు,కేంద్ర ప్రభుత్వం అవలంభించే ప్రజా వ్యతిరేక విధానాలపై ఎప్పటికప్పుడు పోరాటాలను నిర్మించాలనీ పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో సిపిఐ మరిపెడ పట్టణ కార్యదర్శిగా పగిళ్ల.అంజి,సహాయకార్యదర్శిగా రాసాల.వీరేందర్‌లను ఎకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగినది.ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ,జిల్లా కౌన్సిల్ సభ్యులు అబ్దుల్ రషీద్,తురక రమేష్,పానుగోతు వెంకన్న,హనుమంతు, రాములు,మధు, వెంకన్న,తదితరులు పాల్గొన్నారు.

## మా గ్రామాన్ని పట్టించుకునే నాథుడే లేడా? : సర్పంచ్

**ప్రజాపక్షం /నడికూడ :** పరకాల నియోజకవర్గ పరిధిలోని నడికూడ మండల పరిధిలోని వెంకటేశ్వర్లపల్లి గ్రామంకు ఉన్న రోడ్డు మా గ్రామ పరిధిలో వాగు నుంచి వెంకటేశ్వర్లపల్లి వరకు వెంకటేశ్వర్లపల్లి నుండి మర్రిపల్లిగూడెం వరకు గ్రామ ప్రజల సహకారంతో 6కి.మీ మోరం పోయడం జరిగిందని గత ప్రభుత్వం వాగు నుంచి వెంకటేశ్వర్లపల్లి వరకు గత మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఎంఆర్ఆర్ గ్రాంట్ నుంచి 1కోటి 50లక్షల మంజూరు చేయడం జరిగిందని ఈ పనులు చేయడం లేదని వెంకటేశ్వర్లపల్లి నుంచి నర్సింగాపూర్ వరకు గత సంవత్సరం పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి శిలపలకం వేశారు.మా గ్రామన్ని పట్టించుకునే నాథుడు లేడా అని మా గ్రామ ప్రజలు కోరుతున్నారని గ్రామ సర్పంచ్ పెండ్యాల మహేందర్ రెడ్డి తెలిపారు.

## హన్మకొండలో 11న భారీ అబ్‌స్ట్రాక్ట్ ఆర్ట్ ఫెస్టివల్



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** సాగంటిస్ ఆర్ట్స్ అకాడ మీ అండ్ హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో హన్మకొండలో భారీ అబ్‌స్ట్రాక్ట్ ఆర్ట్ ఫెస్టివల్ నిర్వహించనున్నారు. ఈ రం గుల వేడుక అక్టోబర్ 11, 2026 (ఆదివారం) ఉదయం 10:00 గంటలకు కిషన్‌పురలోని మాస్టర్జీ స్కూల్ ఆవరణలో ప్రారంభం కానుంది. ఈ పోటీల్లో పాల్గొనదలిచిన విద్యార్థులు అక్టోబర్ 10వ తేదీ లోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమానికి సంబంధించిన వివరాలను సంస్థ డైరెక్టర్ డాక్టర్ మంజుల సాగంటీ వెల్లడించారు. నర్సరీ నుండి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులందరికీ ఈ పోటీల్లో ప్రవేశం ఉంటుందని ఆమె తెలిపారు. చిత్రలేఖనంలో ముందస్తు నైపుణ్యం లేకపోయినా, రంగులపై ఆసక్తి, కల్పనా సామర్థ్యం ఉన్న ప్రతి ఒక్కరూ ఇందులో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.100 మంది పిల్లలు ఒకే పెద్ద కాన్వాస్ గా కేవలం ఒక గంట వ్యవధిలో 100 మంది విద్యార్థులు కలిసి ఒకే పెద్ద కాన్వాస్‌పై ఒక అద్భుతమైన కళాఖండాన్ని సృష్టించనున్నారు. పోటీకి కావలసిన చార్టులు, రంగులు సంస్థ అందిస్తుంది. పాల్గొనే ప్రతి విద్యార్థికి ప్రత్యేకంగా మెగా ఆర్టిస్ట్ సర్టిఫికేట్‌తో పాటు మెడల్, స్పెషల్ గిఫ్ట్ అందజేయబడుతుందని ఆమె తెలిపారు. కళలపై ఆసక్తి ఉన్న విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. పేర్ల నమోదు, మరిన్ని వివరాల కోసం 8143643337 నంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.

## చిమ్మని చీకటి... పట్టించుకోని విద్యుత్ అధికారులు

**ప్రజాపక్షం/ కమలాపూర్:** కమలాపూర్ మండల కేంద్రంలో మండల అభివృద్ధి కార్యాలయం నుంచి మైసమ్మ చెట్టు పోలీస్ స్టేషన్, అంబేద్కర్ విగ్రహం వరకు వెళ్ళే రహదారిలో సాయంత్రం సమయంలో వీధి దీపాలు లేక పూర్తిగా చీకటిమయంగా ఉందని, ఆ రహదారి వెంట వెళ్ళే ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆ దారి గుండా నడిచేవారు, ప్రధానంగా మహిళలు భయాందోళనకు గురవుతున్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం వీధి దీపాలు ఏర్పాటు ప్రయాణికులు విద్యుత్ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. అదే విధంగా గతంలో జరిగిన ఉప ఎన్నికల సమయంలో కమలాపూర్ బస్టాండ్ వద్ద సెంటర్ లైటింగ్ ఏర్పాటు చేసిన వీధి దీపాలు కొంతకాలం విద్యుత్ కాంతులతో కలకలాడింది. ఆ తర్వాత అధికారుల పాలన నుంచి వీధి దీపాల వెలుతురు లేక చీకటి మయంగా కనిపిస్తుంది. ప్రయాణికులు రాత్రి వేళల్లో ప్రయాణించేటప్పుడు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ఇప్పటికైనా అట్టి వీధి దీపాలు వెలిగే విధంగా మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఈ విషయం పై విద్యుత్ అధికారులు స్పందించి వెంటనే తగు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## సోమయ్య కుటుంబానికి అండగా ఉంటా : సుందర్ రాం రెడ్డి

**ప్రజాపక్షం/దేవరుప్పుల:** ఇటీవల మృతి చెందిన మండలంలోని ధర్మపురం గ్రామ పంచాయితి సిబ్బంది దండు సోమయ్య కుటుంబానికి అండగా ఉంటామని బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పల్లా సుందర్ రాం రెడ్డి అన్నారు. సోమవారం వారి ఇంటికి వెళ్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించడం జరిగింది. వారి కుటుంబానికి అండగా ఉంటానమి భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి మాజీ వైస్ చైర్మన్ కృష్ణమూర్తి, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు రాజు, బీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

**పరామర్శించిన పల్లా...**

మండలంలోని మాధాపురం గ్రామానికి చెందిన వర్రె ప్రశాంత్ ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం ఢీకొనడంతో గాయాలపాలయ్యారు. దీంతో విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పల్లా సుందర్ రాంరెడ్డి ప్రశాంత్‌ని పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వారి వెంట బీఆర్ఎస్ నాయకులు, తదితరులున్నారు.

## ఎల్లాపూర్‌లో ఎన్ఎస్ఎస్ వారాంతం ప్రత్యేక శిబిరం



**ప్రజాపక్షం/హసన్ పర్తి:** ఎన్ఎస్ఎస్ ద్వారా విద్యార్థుల్లో సేవాభావం, క్రమశిక్షణ, సామాజిక కృషి నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత పెంపొందుతాయని అసోసియేట్ ఫిజికల్ డైరెక్టర్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కె రవీందర్ అన్నారు. హనుమ కొండ జిల్లా హసన్ పర్తి మండలం ఎల్లాపూర్ గ్రామంలో సోమవారం ఎస్ ఆర్ యూనివర్సిటీ, వరంగల్‌కు చెందిన ఎస్ ఆర్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో 2026–2027 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఎన్ఎస్ఎస్ వారాంత ప్రత్యేక శిబిరం అక్టోబర్ 5న ఘనంగా ప్రారంభమైంది. ఈ ప్రత్యేక శిబిరం అక్టోబర్ 5 నుండి 11వరకునిర్వహించబడుతోంది. ఈ సందర్భంగా అసోసియేట్ ఫిజికల్ డైరెక్టర్ , ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ కెరవీందర్ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను ఉద్దేశించి ప్రసంగిస్తూ, ఏడు రోజుల పాటు నిర్వహించే అన్ని కార్యక్రమాల్లో వాలంటీర్లు చురుకుగా పాల్గొని, గ్రామ ప్రజలకు ఉపయోగపడే విధంగా సేవాకార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ఎన్ ఎస్ ఎస్ ద్వారా విద్యార్థుల్లో సేవాభావం, క్రమశిక్షణ, సమిష్టి కృషి, నాయకత్వ లక్షణాలు,సామాజిక బాధ్యత పెంపొందుతాయని వివరించారు.ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సమాజ సేవకు అంకితభావంతో పనిచేస్తామని, నేను కాదు, నువ్వు" అనే ఎన్ ఎస్ ఎస్ స్ఫూర్తిని కొనసాగిస్తామని ప్రతిజ్ఞ చేశారు. వనజ, జడ్ పి హెచ్ఎస్ పాఠశాల ముంతాజ్, నాగరాజ్ వాలంటీర్లను ఉద్దేశించి ప్రసంగిస్తూ విలువైన సూచనలు మార్గదర్శకత్వం అందించారు.ఈ కార్యక్రమంలో ఎస్సార్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగము, జడ్పీహెచ్ఎస్ ఎల్లాపూర్ ప్రభుత్వం పాఠశాల ఉపాధ్యాయుని,ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## సర్కార్ బడికి సౌండ్ సిస్టం అందజేత

**ప్రజాపక్షం/పాలకుర్తి:** మండలంలోని ఎంపీపీఎస్ తిరుమలగిరి పాఠశాలకు తాళ్లపెల్లి యాకలక్ష్మి కృష్ణ దంపతులు చేయూతనందించారు. రూ.6వేల విలువగల సౌండ్ సిస్టంను బహుకరించారు. సౌండ్ సిస్టంను దాత ఉపాధ్యాయులకు అందించారు. ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి దాతలు ముందుకు రావడం సంతోషకరమని సర్పంచ్ చెరిపెల్లి మమత అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజు, పాఠశాల హెచ్ఎం జె సత్యనారాయణ, ఉపాధ్యాయులు రాజ్ కుమార్, పంచాయితీ కార్యదర్శి హైమావతి, గ్రామస్థులు నరేష్, సుధాకర్, రాజు, రణధీర్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను తక్షణమే పరిష్క్రరించాలి

**ప్రజాపక్షం/మెదక్ :** ప్రజావాణి దరఖాస్తులను దక్షిణ తక్షణమే పరిష్కరించాలని డిఆర్ఓ అంబాదాస్



రాజేశ్వర్ సూచించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సమావేశ మందిరంలో అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా భూ భారతి 24, ఇందిరమ్మ ఇండ్లు 15, పెన్షన్లు 3, ఇతర 37 మొత్తం 79 దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ జోజి, డిఆర్డిఓ శ్రీనివాస రావు, ఏఓ యూనస్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

**ప్రజాపక్షం/పాపన్నపేట:** ఉరి వేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని పొడ్చన్ పల్లి తండాలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం వివరాలు పొడ్చన్ పల్లి తండాకు చెందిన పాల్యా అంబ్రియా(68) వ్యవసాయం చేసుకుంటూ జీవితం గడుపుతున్నాడు. కొన్ని రోజులుగా మద్యానికి బానిసగా మారి పిచ్చిగా ప్రవర్తిస్తూ తరచూ ఇంట్లో ఉన్న కుటుంబీకులతో గొడవ పడుతున్నాడు. సోమవారం ఉదయం తండా సమీపంలో ఓ చెట్టుకు ఉరి వేసుకుని కనిపించాడు. కుటుంబీకులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి పోలీసులకు సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకుని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించి మృతుడి కుమారుడు శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

## ఘనంగా బొడ్డెమ్మ బతుకమ్మ సంబరాలు

**ప్రజాపక్షం/టేక్మాల్:** భారతీయ జనతా పార్టీ మాజీ మండల అధ్యక్షుడు డాకప్ప గారి నవీన్



గుప్త ఆధ్వర్యంలో సోమవారం మహిళలు బొడ్డెమ్మ బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ మహిళలు ఉత్సాహంగా సంబరాల్లో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు స్వరూప రాణి, ఉమా తదితర మహిళలు పాల్గొన్నారు.

## సిపిఐ ఆద్వర్యంలో ఉచిత హెల్త్ క్యాంపు

**ప్రజాఫక్షం/సంగారెడ్డి :**సంగారెడ్డి పట్టణంలో గల మార్స్ నగర్‌లో వెల్నెస్ హాస్పిటల్ వారి సౌజన్యంతో సిపిఐ సంగారెడ్డి కమిటీ ఆద్వర్యంలో ఉచిత క్యాంపు ,హెల్త్ కార్డులు పంఫిణి చేయడం జరిగింది. ఈ సందర్బంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి రెహ్మాన్ మాట్లాడుతూ వెల్నెస్ హాస్పిటల్ వారు హెల్త్ క్యాంపులు, హెల్త్‌కార్డులు ఇస్తూ పేద ప్రజలకు సహాయాన్ని అందిస్తున్నారఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు సంతోష్, తిలక్ , వెల్నెస్, హాస్పిటల్ సిబ్బంది డాక్టర్ రమేష్, శ్రీలత, శ్రీజ అర్జున్ పాల్గొన్నారు.

# రైతులకు తప్పని కరెంటు కష్టాలు..



**ప్రజాపక్షం/అల్లాదుర్గం :**మండల లోని ఆయా గ్రామాలలో విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయాలు ఏర్పడుతుండటంతో ట్రాన్స్ఫార్మర్లు కాలిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నీలకంటి పల్లి గ్రామంలో నో వోల్టేజ్ సమస్యతో ట్రాన్స్ఫరాలు కాలిపోయి పంటలకు నీరు అందించేందుకు విద్యుత్ మోటార్లపై ఆధారపడుతున్న రైతులకు కరెంటు కోతలు సమస్యగా మారాయి. రాత్రి వేళల్లో విద్యుత్ సరఫరా కావడంతో పొలాల్లోకి వెళ్లి మోటార్లు ఆన్‌చేయాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.అధికారులు స్పందించి వ్యవసాయానికి నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని, తరచూ ఏర్పడుతున్న అంతరాయాలను వెంటనే పరిష్కరించాలని రైతులు కోరారు. ఏఈ నవాజ్ ను వివరణ కోరగా విద్యుత్ సమస్యలు ఉన్న మాట వాస్తవమే ఎల్నినో ప్రభావంతో వర్షాలు లేక కరెంటు ఉత్పత్తి తగ్గినందున నో వోల్టేజ్ సమస్య ఏర్పడుతుందని దానివల్ల ట్రాన్స్ఫార్మర్ కాలిపోతున్నాయని అన్నారు. అందుకు తగిన మరమ్మత్తులు వెంటనే చేస్తామన్నారు. సోలార్ విద్యుత్ తో పొద్దున ఏడు గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు త్రీఫేస్ కరెంట్ అందిస్తున్నట్లు ఈ సమయాన్ని రైతులు వినియోగించుకోవాలని తెలిపారు.

# పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి

### మెదక్ ఎంపీ రఘునందన్ రావు..



**ప్రజాపక్షం/ రామాయంపేట :** ప్రాంతంలో పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి మొక్కలు నాటడమే లక్ష్యంగా ముందుకు సాగాలని మెదక్ ఎంపీ రఘునందన్ రావు పిలుపునిచ్చారు. సోమవారం ఆయన రామాయంపేటలో పర్యటించి మొక్కలు నాటే స్థలాలను పరిశీలించారు. సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా రామాయంపేట నుంచి సిద్దిపేట వరకు ఉన్న 765 డీజీ జాతీయ రహదారికి ఇరువైపులా బాదం మొక్కలు నాటే బృహత్తర కార్యక్రమం చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. 43 కిలోమీటర్ల మేర సుమారు 30 వేల మొక్కలను నాటి, వాటి పరిరక్షణ బాధ్యతను పూర్తిస్థాయిలో భుజాన వేసుకుంటామని ఎంపీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల మంగళవారం ప్రారంభించనున్నారు. రామాయంపేటలో జరగనున్న గవర్నర్ పర్యటన ఏర్పాట్లను ఎంపీ రఘునందన్ రావు స్వయంగా పరిశీలించారు. మెదక్ నుంచి ఎలుకతుర్తి వరకు కొత్తగా నిర్మించిన 765 డీజీ జాతీయ రహదారి పక్కన ఒకే రోజు 32 వేల మొక్కలు నాటే ఈ కార్యక్రమంలో గవర్నర్ పాల్గొంటారని వెల్లడించారు. ఈ కార్యక్రమం అనంతరం నిర్వహించనున్న బహిరంగ సభకు సంబంధించిన ఏర్పాట్లను ఎంపీ అధికారులతో కలిసి క్షుణ్ణంగా సమీక్షించారు. పర్యావరణాన్ని హరితమయం చేసే దిశగా అడుగులు పడుతుండటంతో స్థానిక ప్రజలు, అధికారులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు.

# ఫీడర్ల సామర్థ్యం పెంచేందుకు ప్రతిపాదన లు పంపండి

**ప్రజాపక్షం/పాపన్నపేట:** ఫీడర్ లా సామర్థ్య పెంచేందుకు ప్రతిపాదన పంపాలని, లో వోల్టేజ్ సమస్యలు లేకుండా చూడాలని టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ వి.జితేష్ పాటిల్ సూచించారు. సోమవారం మండల పరిధిలోని మిన్పూర్ సబ్ స్టేషన్ పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అంతకుముందు ఆయన ఏడుపాయల దుర్గ భవాని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించగా ఆలయ పూజారులు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం మండల పరిధిలోని యూసుఫ్‌పేటలో రైతులతో సీఎండీ మాట్లాడారు. రైతులు వరి సాగుపై మాత్రమే ఆధారపడకుండా ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. ఆరుతడి పంటల ద్వారా ఎకరాకు మంచి ఆదాయం పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. మిన్పూర్ 220 కేవీ సబ్‌స్టేషన్‌లోని నార్సింగి ఫీడర్‌ను పరిశీలించారు. ఫీడర్‌పై లోడ్ సామర్థం అధికంగా ఉందని ఎస్‌ఈ నారాయణ నాయక్, డీఈ రామేశ్వర స్వామి సీఎండీ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన సీఎండీ అవసరమైన పనులకు ఎస్టిమేషన్ రూపొందించి పంపించాలని అధికారులను ఆదేశించారు. అంతకుముందు సీఎండీ వి.జితేష్ పాటిల్, సీజీఎం బాలస్వామి మెదక్ జిల్లాలోని పలు మండలాల్లో పర్యటించి విద్యుత్ సరఫరా పరిస్థితిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మెదక్ సర్కిల్ ఎస్‌ఈ నారాయణ నాయక్, డీఈ రామేశ్వరస్వామి, మెదక్, పాపన్నపేట ఏడీఈలు వెంకటేశ్వర్లు, మోహన్ బాబు, విద్యుత్ ఏఈలు నర్సింలు, ఉదయ్ భాస్కర్, లైన్ ఇన్‌స్పెక్టర్ సంగయ్య, మిన్పూర్ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఔషధ తయారీలో ఫార్మసిస్టుల పాత్ర ఎంతో కీలకం




**ప్రజాపక్షం/నర్సాపూర్:** ఔషధల తయారీలో ఫార్మసిస్టులో పాత్ర ఎంతో కీలకమని విష్ణు విద్యా సంసలు చైర్మన్ కే విష్ణు రాజు అన్నారు. నర్సాపూర్ లోని విష్ణు ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (వైపర్) కళాశాలలో సోమవారంనూతన విద్యార్థుల పరిచయ వేదిక ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విష్ణు విద్యా సంస్థల చైర్మన్ కె.విష్ణు రాజు, వైస్ చైర్మన్ డాక్టర్ రవిచంద్రన్ రాజగోపాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా *చైర్మన్ శ్రీ కె. విష్ణు రాజు మాట్లాడుతూ, ఫార్మసీ రంగం ప్రాముఖ్యత ఈ రోజుల్లో మరింత పెరిగింది. ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది ఫార్మా శాస్త్రవేత్తలు అనేక రకాల ప్రాణాలను కాపాడే ఔషధాలను తయారు చేస్తున్నారు. అందులో ఫార్మసిస్టుల పాత్ర కీలకం. కోవిడ్ వ్యాక్సిన్ తయారీలో కూడా ఫార్మసిస్టుల కృషి ఎంతో అన్నారు. మనకు తెలిసిన ప్రముఖ బ్రాండ్లు అయిన కోకాకోలా, చిన్న పిల్లల ఆహార ఉత్పత్తులను అందించే నెస్లే వంటి సంస్థల ఉత్పత్తులను కూడా ఫార్మసీ నేపథ్యం ఉన్న వారే ఆవిష్కరించారు. ప్రతి మెడికల్ షాపులో తప్పనిసరిగా ఫార్మసీ విద్యను అభ్యసించిన వారే ఉండాలి. హైదరాబాద్ లో ఎన్నో ఫార్మా పరిశ్రమలు ఉన్నాయి, విద్యార్థులు వాటిని సందర్శించి ప్రత్యక్షంగా తెలుసుకోవాలి అన్నారు. విద్యార్థులు సోషల్ మీడియాలో వచ్చే ప్రతి కథనాన్ని నమ్మకుండా పూర్తిగా తెలుసుకున్న తర్వాతే నమ్మాలి. పుస్తక పఠనానికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలి అని సూచించారు. వైస్ చైర్మన్ డా॥ రవిచంద్రన్ రాజగోపాల్ మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో ఏఐ టెక్నాలజీ ప్రాధాన్యత ఎంతో ఉంది. మన కళాశాలలో జపనీస్ లాంగ్వేజ్ తో పాటు విదేశీ కోర్సులను కూడా నేర్పిస్తున్నారని ఫార్మసీ విద్యార్థులు ఇంజనీరింగ్ విద్యార్థులతో కలిసి ప్రయోగాలు చేసి నూతన ఆవిష్కరణలకు కృషి చేయాలి అని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డా॥ ఏ.రమేష్, వివిధ విభాగాల హెచ్.ఓ.డీలు, అధ్యాపకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మాతా శిశు సంరక్షణకు ప్రభుత్వం కృషి

### మెదక్ ఎంపిడిఒ లక్ష్మీ

**ప్రజాపక్షం/మెదక్ :** మాతా, శిశు సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని మెదక్ ఎంపీడీఓ లక్ష్మి అన్నారు. సోమవారం మెదక్ మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు.



ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోందనీ, ఇందుకు అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేస్తున్నదనీ పేర్కొన్నారు. ప్రభుత్వం యేటా సెప్టెంబర్ మాసంలో పోషణ్ అభియాన్ మాసోత్సవాలను నిర్వహిస్తోందన్నారు. ఐసీడీఎస్ సీడీపీఓ వెంకట రమణమ్మ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన ఆహారం, ఆరోగ్య సంరక్షణపై ప్రచారం నిర్వహిస్తారనీ తెలిపారు. చిన్నారుల ఎదుగుదల, మాతా శిశు సంరక్షణతో పాటు సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అక్టోబర్ 8వ తేదీ వరకు పోషణ మాసోత్సవాలు నిర్వహిచనున్నారనీ తెలిపారు. ఆరోగ్య రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలను చైతన్యవంతం చేయడమే దీని ముఖ్య ఉద్దేశమని, పోషణ మాసోత్సవాలు విజయవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం, అధికార యంత్రాంగ ప్రత్యేక కార్యాచరణ రూపొందించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మాధవి, రమ, పోషణ్ అభియాన్ బ్లాక్ కో ఆర్డినేటర్ బెతయ్య, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ పైప్ లీకేజీ..

### పట్టించుకోని అధికారులు

**ప్రజాపక్షం/అల్లాదుర్గం :**ఐకెపి భవనంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఒక్క దరఖాస్తు వచ్చినట్లు ఎంపీడీవో వేద ప్రకాష్ రెడ్డి తెలిపారు. ప్రజావాణిలో మండలంలోని కొన్ని శాఖల అధికారులుపూర్తి స్థాయిలో హాజరు కావడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని వారి నివేదిక మండల ప్రత్యేక అధికారి దృష్టికి తీసుకువెళ్లి వారిపై తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. చిల్వర్ గ్రామ శివారులో మిషన్ భగీరథ పైప్ లైన్ పగిలి గత 15 రోజులుగా వేల లీటర్ల తాగునీరు వృధాగా పోతోంది. దీంతో గ్రామంలో తాగునీటి ఎద్దడి నెలకొనడంతో పాటు, రోడ్డు పూర్తిగా బురదమయమై రైతులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.వెంటనే చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ మల్లయ్య, మండల వ్యవసాయ అధికారి నెలవంక, ఎంపీ ఓ ప్రభాకర్, ఏపీవోసుధాకర్, సుదర్శన్, సాయిలు, తేజస్విని తదితరులు పాల్గొన్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

**ప్రజాపక్షం/అల్లాదుర్గం:** మండల పరిధిలోని అప్పాజీ పల్లి గ్రామంలో సోమవారం గ్రామ సర్పంచ్ గంధాలి రవికుమార్ స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు.ప్రతి ఒక్కరు ప్రభుత్వం అందిస్తున్న పథకాలకు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్మార్ట్ రేషన్ కార్డులు తో రాష్ట్రంలో ఎక్కడైనా రేషన్ సరుకుల తీసుకువచ్చని ఈ అవకాశాన్ని లబ్ధిదారులు ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నవీన్, వార్డు సభ్యులు సాయిలు ,పోచయ్య, జి పి ఓ సాయిలు, సత్తయ్య, పాపయ్య, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## వరాహి బాంకెట్ హాల్ ప్రారంభోత్సవం

### పటాన్ చెరు ప్రముఖులతో పాల్గొన్న మాద్రి వృథ్వీరాజ్

**ప్రజాఫక్షం/సంగారెడ్డి :** పటాన్‌చెరులోని మకుట అరుణ ఆర్కేడ్ కాంప్లేక్స్ లో నూతనంగా ఏర్పాటు చేసిన వరాహి బాంకెట్ హాల్ ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎండిఆర్ ఫౌండేషన్ కో ఫౌండర్ మాద్రి వృథ్వీరాజ్ పటాన్‌చెరు పట్టణ ప్రముఖులతో కలిసి పాల్గొని వరాహి బాంకెట్ ఆల్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. నూతనంగా ప్రారంభమైన ఈ బాంకెట్ హాల్ ప్రజలకు మరింత అందుబాటులోకి వచ్చి వివిధ శుభాకార్యాలకు చక్కని వేదికగా నిలవాలని నిర్వాహకులకు రాబోయే రోజుల్లో మరింత విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటీసీ ఎం.జైపాల్, సిపిఐ రాష్ట్ర నాయకులు వీర్ల ప్రకాశ్‌రావు మాజీ కార్పోరేటర్ సిఫాస్ దేవ్ , అమరేందర్ ,మతిన్, సోమశేఖర్, రాజు ,తదితరులు పాల్గొన్నారు. వరాహి బంకెట్ హాల్ యాజమాన్యానికి హృదయపూర్వక శుభాక్షాంక్షలు తెలిపారు.

